ఆగని దందా..అదే పంథా

చేపలకు మేతగా చికెన్ వ్యర్థాలు

- రాత్రి వేళల్లో యథేచ్ఛగా తరలింపు
- పోలీసులు పట్టుకుంటున్నా ఆగని అక్రమ రవాణా
- తాజాగా గురువారం రెండు వాహనాల పట్టివేత



గురువారం పట్టుకున్న మినీవ్యాన్‌లోని చికెన్ వ్యర్థాలను పూడ్చిపెడుతున్న అధికారులు

సంగం: చేపల గుంతలకు చికెన్ వ్యర్థాల సరఫరా ఆగడం లేదు. చేపలకు మేతగా చికెన్ వ్యర్థాల వినియోగంపై నిషేధమున్నా వాటిని తరలిస్తున్న వాహనాలు తరచూ పోలీసులకు పట్టుబడుతూనే ఉన్నాయి. తాజాగా గురువారం కూడా సంగంలో ముంబై రహదారిపై చికెన్ వ్యర్థాలను తరలిస్తున్న రెండు వాహనాలను పోలీసులు పట్టుకున్నారు. కాదేదీ వ్యాపారానికి అనర్హం అన్నట్లు ఈ రోజుల్లో ప్రతిదీ వ్యాపారమే. ఆఖరికి పనికిరాని చికెన్ వ్యర్థాలను కూడా కొందరు వ్యాపారంగా మార్చుకుని చేపల పెంపకందారులకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఎన్నిసార్లు అధికారులు పట్టుకున్నా, వాహనాలను సీజ్ చేసినా కాసులకు అలవాటు పడిన వ్యాపారులు తమ దారి తమదేనన్నట్లుగా చికెన్ వ్యర్థాల అక్రమ రవాణాను కొనసాగిస్తున్నారు. నెల్లూరు–ముంబై జాతీయ రహదారిపై చికెన్ వ్యర్థాలు యథేచ్ఛగా తరలిపోతున్నాయి. పలుమార్లు అధికారులు పట్టుకుని గుంతలు తీసి పూడ్చి వేస్తున్నా దందాను కొనసాగిస్తూనే ఉన్నారు.

అక్రమ రవాణా ఇలా...

చికెన్ వ్యర్థాల అక్రమ రవాణాకు వేస్ట్‌ఫుడ్ మాఫియా బరితెగిస్తోంది. తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ తదితర రాష్ట్రాల్లోని చికెన్ షాపుల నుంచి కిలో రూ.5 చొప్పున వ్యర్థాలను కొనుగోలు చేసి చేపల పెంపకందారులకు రూ.10 వంతున విక్రయిస్తున్నారు. చికెన్ దుకాణాల వద్ద డ్రమ్ములను ఏర్పాటు చేసి సేకరించిన వ్యర్థాలను మినీవ్యాన్లలో రాత్రి వేళల్లో చెరువుల వద్దకు తరలిస్తున్నారు. ఈ దందా గుట్టుచప్పుడు కాకుండా కొనసాగుతూనే ఉంది. చికెన్ వ్యర్థాలను తరలించే వాహనం రోడ్డుపై వెళ్తుంటే చుట్టుపక్కల ప్రాంతాల వారు ముక్కులు మూసుకోవాల్సిన పరిస్థితి. వ్యర్థాలను తరలించే వాహనాలు మితిమీరిన వేగంతో వెళ్లే క్రమంలో రోడ్లపై బోల్తాపడిన సందర్భాల్లో దుర్గంధం భరించలేకుండా ఉంటుంది. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి అధిక మొత్తంలో చికెన్ వ్యర్థాలను సంగం మండలంలోని చేపల చెరువులకు తరలిస్తున్నట్లుగా స్థానికులు చెబుతున్నారు. చేపల గుంతల్లో చికెన్ వ్యర్థాలను వేయడం వల్ల పరిసర ప్రాంతాల ప్రజలు దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు భూగర్భజలాలు కలుషితమవుతున్నాయి. చికెన్ వ్యర్థాలతో పెంచిన చేపలను తినడం వల్ల ఆరోగ్యానికి ముప్పు ఏర్పడుతుంది. ఈ విషయాలు తెలిసినా, అధికారులు పట్టుకుంటున్నా కాసులకు కక్కుర్తిపడి చికెన్ వ్యర్థాల మాఫియా దందాను ఆపడం లేదు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని చికెన్ వ్యర్థాలను తరలించే మాఫియాపై అధికారులు మరింత కఠినంగా వ్యవహరించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రెండు వాహనాలు పట్టివేత

సంగం కొండమలుపులో చికెన్ వ్యర్థాలను అక్రమంగా తరలిస్తున్న రెండు వాహనాలను పోలీసులు గురువారం పట్టుకున్నారు. కొండ ప్రాంతంలో గుంతతీసి మత్స్య, రెవెన్యూ శాఖల అధికారుల సమక్షంలో చికెన్ వ్యర్థాలను పూడ్చిపెట్టారు. వాహనాలపై కేసులు నమోదు చేసి సీజ్ చేశారు. అలాగే గత ఫిబ్రవరిలో మండలంలోని పడమటిపాళెం, దువ్వూరు ప్రాంతాల్లో 30 డ్రమ్ముల చికెన్ వ్యర్థాలను తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు పట్టుకున్నారు. మార్చిలో చికెన్ వ్యర్థాల లారీని మాజీ ఎంపీటీసీ స్వయంగా పట్టుకుని అధికారులకు అప్పగించారు.



గురువారం పోలీసులు పట్టుకున్న చికెన్ వ్యర్థాల లారీ

క్లుప్తంగా

దరఖాస్తుల పరిశీలన



అనుమసముద్రంపేట: మండల పరిషత్ కార్యాలయంలో ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలకు సంబంధించిన దరఖాస్తులను ఎంపీడీఓ ప్రసాద్ బ్యాంకు మేనేజర్లతో కలిసి గురువారం పరిశీలించారు. మండలానికి 11 యూనిట్ల రుణాలను కేటాయించగా, 62 మంది దరఖాస్తు చేసుకున్నారు. అందులో 48 మంది దరఖాస్తుల పరిశీలనకు హాజరయ్యారని ఎంపీడీఓ తెలిపారు. కెనరా, యూనియన్ బ్యాంకు మేనేజర్లు వెంకటేశ్వరరావు, తిలక్, యూనియన్ బ్యాంక్ మేనేజర్ కృష్ణముని, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెట్రోల్ బంకు నిర్వహణను మెరుగుపరచాలి



సీతారామపురం : స్థానిక మారంరెడ్డిపల్లి పీఏసీఎస్ ఆవరణలోని పెట్రోల్ బంకును జిల్లా కోఆపరేటివ్ అధికారి గుర్రప్ప గురువారం పరిశీలించారు. మండలంలో మూడు జాతీయ రహదారులు ఏర్పడుతున్నందున పెట్రోల్ బంకు నిర్వహణను మరింత మెరుగుపరచాలని సూచించారు. సొసైటీకి సంబంధించిన కంప్యూటరీకరణ ప్రక్రియ పూర్తయిందని, త్వరలో ఆన్‌లైన్ ద్వారా లావాదేవీలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. సొసైటీ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం సొసైటీ రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. కావలి డివిజనల్ కోఆపరేటివ్ అధికారి తిరుపాల్‌రెడ్డి, ఉదయగిరి సబ్‌డివిజనల్ కోఆపరేటివ్ అధికారి శ్రీనివాసులురెడ్డి, సొసైటీ సీఈఓ శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

పాఠ్యపుస్తకాల పరిశీలన



ఉదయగిరి: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిల్వ చేసిన 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించిన పాఠ్యపుస్తకాలను ఎంఈఓ-1 తోట శ్రీనివాసులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర పథకం కింద మండలానికి తొలి విడతగా 1 నుంచి 10వ తరగతి వరకు 14,004 పుస్తకాలను ప్రభుత్వం పంపిణీ చేసిందని తెలిపారు. అన్ని పుస్తకాలు వచ్చిన తర్వాత పాఠశాలలకు పంపిణీ చేస్తామన్నారు. ప్రభుత్వం అందజేసే ఉచిత పాఠ్యపుస్తకాలు ప్రభుత్వ పాఠశాలల్లో తప్ప ప్రైవేట్ పాఠశాలల్లోని విద్యార్థుల వద్ద ఉండరాదన్నారు. ఎవరి వద్ద అయిన ఉంటే విచారించి చర్యలు చేపడతామన్నారు.

నాణ్యత ప్రమాణాలు పాటించాలి



సీతారామపురం: స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహంలో జరుగుతున్న మరమ్మతు పనులను ఉదయగిరి ఏఎస్‌డబ్ల్యూఓ ఆదిలక్ష్మి గురువారం పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ నిర్ణీత గడువులోగా మరమ్మతు పనులను పూర్తి చేయాలని సూచించారు. ఆమె వెంట ఆర్‌అండ్‌బీ వర్క్‌ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, వార్డెన్ రమణారెడ్డి, తదితరులు ఉన్నారు.

రేపటి నుంచి శ్రీశైలానికి ఎక్స్‌ప్రెస్ సర్వీసు

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు డిపో నుంచి శ్రీశైలం పుణ్యక్షేత్రానికి ఎక్స్‌ప్రెస్ సర్వీసును శనివారం నుంచి ప్రారంభించనున్నట్లు డిపో మేనేజర్ కరిమున్నీసా గురువారం తెలిపారు. ఉదయం 7 గంటలకు ఆత్మకూరులో బస్సు బయలుదేరి సాయంత్రం 4 గంటలకు శ్రీశైలం చేరుతుందన్నారు. అలాగే ఉదయం 8 గంటలకు శ్రీశైలంలో బయలుదేరే బస్సు సాయంత్రం 4.45 గంటలకు ఆత్మకూరు చేరుతుందని తెలిపారు. వింజమూరు, పామూరు, కనిగిరి, పొదిలి, మార్కాపురం, దోర్నాల కేంద్రాల్లో బస్సు ఆగుతుందన్నారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఏడుగురు జూదరుల అరెస్ట్

అనుమసముద్రంపేట: మండలంలోని చిరమన పొలాల్లో గురువారం పేకాట నిర్వహిస్తున్నారనే సమాచారంతో ఎస్సై సైదులు తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఏడుగురు జూదరులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.88,680 నగదు, ఐదు బైక్‌లు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

గిరిజనులకు రేషన్ కార్డులు ఇవ్వాలి



సోమశిల: గిరిజనులకు రేషన్‌కార్డులు, పింఛన్లు ఇవ్వాలని సీపీఎం గిరిజన శాఖ కార్యదర్శి నాగులూరు వెంకటేష్ కోరారు. గురువారం ఆయన అనంతసాగరంలోని గిరిజన కాలనీలో ఇంటింటికి తిరిగి రేషన్ కార్డులు, పింఛన్లు లేనివారిని గుర్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన కాలనీలో నూతనంగా వివాహమైన వారికి రేషన్ కార్డులు లేవన్నారు. అర్హులైన చాలా మందికి పింఛన్లు లేవని తెలిపారు. మండలాధికారులు స్పందించి రేషన్ కార్డులు, పింఛన్లు మంజూరు చేయాలని కోరారు. సభ్యులు మస్తాన్, అంకయ్య, బాలేష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.


22న హనుమజ్జయంతి ఉత్సవాలు

ఉదయగిరి రూరల్: ఈ నెల 22న హనుమజ్జయంతిని పురస్కరించుకుని గండిపాళెం జలాశయం వద్ద నూతనంగా నిర్మించిన అభయాంజనేయస్వామి ఆలయంలో విశేషాభిషేకాలు, అలంకరణ, పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గురువారం తెలిపారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేయనున్నట్లు వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆంజనేయస్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

వేడుకగా అలకలతోపు



గాంధీబొమ్మ సెంటర్ నుంచి కొండపైకి స్వామి, అమ్మవార్లను తీసుకెళ్తున్న భక్తులు



కొండపై భక్తజన కోలాహలం

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలం నల్లగొండ్లలోని హరహర క్షేత్రంలో జరుగుతున్న శ్రీదేవి,భూదేవి సమేత లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా అలకలతోపు సూరసంవాదం, లక్ష్మీసంవాద కార్యక్రమాలను గురువారం వేడుకగా నిర్వహించారు. దేశంలో ఏ క్షేత్రంలో లేని విధంగా నల్లగొండ్ల క్షేత్రంలో అలకలతోపు కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. కొండపై ఉన్న క్షేత్రానికి ఓ వైపు మెట్ల మీదుగా అమ్మవార్లు, మరోవైపు మెట్ల మీదుగా స్వామి వారిని భక్తులు పరుగున తీసుకెళుతారు. కొండపైకి అమ్మవారు ముందుగా చేరుకుంటే సర్వసంపదలు సమకూరుతాయని, స్వామివారు చేరుకుంటే పాడిపంటలు సమృద్ధిగా వృద్ధి చెందుతాయని భక్తుల నమ్మకం. టీటీడీ వేదపండితులు తనూజ్ విష్ణువర్ధనాచార్యులు, నల్లగొండ్ల క్షేత్రం ప్రధానార్చకులు పరాంకుశం సత్యనారాయణార్యుల ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి పరుగుపందెంకు సిద్ధం చేశారు. గాంధీబొమ్మ సెంటర్ నుంచి కొండపైకి ఉన్న ఒక మెట్ల మార్గంలో స్వామి వారిని, మరో మెట్ల మార్గంలో అమ్మవార్లను భక్తులు మోసుకుంటూ పరుగున తీసుకెళ్లారు. స్వామి వారు ముందుగా కొండపైకి చేరుకున్నారు. కాగా అమ్మవార్లను కొండపైకి తీసుకెళ్లే క్రమంలో ఓ వీధిలో వారు ఐదు నిమిషాల పాటు అడ్డుకున్నారు. గ్రామస్తులు వివాదాన్ని సర్దుబాటు చేయడంతో ఉత్సవం ముందుకు సాగింది. శ్రీమారుతి అన్నదాన సమాజం, తూర్పువీధి వారు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఆలయపాలక మండలి మాజీ చైర్మన్ లెక్కల చినకొండారెడ్డి, ఆలయ ఈఓ బండి శాంతయ్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కన్యకాపరమేశ్వరి ఆలయంలో విశేష పూజలు

కావలి(జలదంకి): కావలి పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో జరుగుతున్న కుంభాబిషేక మహోత్సవాలో భాగంగా రెండోరోజు గురువారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం గురుప్రార్థన, అవివాహిత దేవతా పూజలు, చతుర్వేద పారాయణం, నవగ్రహ హోమం, దక్షిణామూర్తి హోమం, మహా మంగళహారతి తదితర పూజలను జరిపారు. సాయంత్రం ధాన్యాదివాసం, పుష్పాదివాసం, తదితర పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.

23న మెగా క్రికెట్ టోర్నమెంట్

సీతారామపురం: మండలంలోని అయ్యవారిపల్లి పంచాయతీ పరిధిలోని గౌతమ్‌నగర్‌లో ఈ నెల 23వ తేదీ అంకమ్మ మెగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గురువారం తెలిపారు. గ్రూప్ హార్డ్ టెన్నిస్ బాల్‌తో నిర్వహించే టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన జట్టుకు రూ.50,116, రన్నర్ జట్టుకు రూ.20,116 నగదు బహుమతులు అందజేయనున్నట్లు చెప్పారు. టోర్నమెంట్ ఎంట్రీ ఫీజు రూ.1,999గా నిర్ణయించామని తెలిపారు. వివరాలకు 79939 05983, 81062 64904 నంబర్లను సంప్రదించాలని కోరారు.

సొసైటీల కంప్యూటరీకరణను వేగవంతం చేయాలి



మొక్క నాటి నీరుపోస్తున్న డీసీఓ గుర్రప్ప

ఉదయగిరి: వ్యవసాయ సహకార పరపతి సంఘాల కంప్యూటరీకరణను సిబ్బంది వేగవంతం చేయాలని జిల్లా కోఆపరేటివ్ అధికారి (డీసీఓ) బీ గుర్రప్ప ఆదేశించారు. మండలంలోని కొట్టాలపల్లి సొసైటీ కార్యాలయంలో ఉదయగిరి సబ్‌డివిజన్ పరిధిలోని సహకార సంఘాల సీఈఓలు, సిబ్బందితో గురువారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. సహకార సంఘాల వారీగా పనితీరును అడిగి తెలుసుకుని సూచనలు చేశారు. సహకార సంఘాలను లాభాలబాటలో నిలపాలన్నారు. కంప్యూటరీకరణను త్వరగా పూర్తిచేసి ఖాతాదారులకు ఆన్‌లైన్ సేవలు అందించాలన్నారు. సహకార సంఘాల్లో సభ్యులుగా ఉన్న రైతులందరికీ విరివిగా రుణాలు ఇవ్వాలన్నారు. రైతులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించి సహకార సంఘాల అభివృద్ధికి సహకరించాలన్నారు. రుణాల రికవరీపై సీఈఓలు ప్రత్యేక దృష్టి సారించి నూరు శాతం వసూళ్లు సాధించాలన్నారు. అనంతరం కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. కావలి డివిజన్ సహకార అధికారి కే తిరుపాల్‌రెడ్డి, ఉదయగిరి సబ్ డివిజన్ సహాయాధికారి పీ శ్రీనివాసరెడ్డి, ఎన్‌డీసీసీబీ మేనేజర్ పీ రాజశేఖర్, సూపర్‌వైజర్ మదీహ, తదితరులు పాల్గొన్నారు.

పొజిషన్ సర్టిఫికెట్లు మంజూరు చేయాలని వినతి



తహసీల్దార్ ప్రమీలకు వినతిపత్రం ఇస్తున్న బీసీకాలనీవాసులు

జలదంకి: మండలంలోని బ్రాహ్మణక్రాక బీసీ కాలనీ వాసులు తమ ఇళ్ల స్థలాలు, ఇళ్లకు పొజిషన్ సర్టిఫికెట్లు మంజూరు చేయాలని కోరారు. ఈ మేరకు తహసీల్దార్ ప్రమీలను గురువారం కలిసి వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం దాదాపు 45 ఏళ్ల క్రితం నివేశన స్థలాలు లేని బ్రాహ్మణక్రాకలోని 80 మందికి భూమిని కేటాయించి పట్టాలు అందజేసింది. అప్పట్నుంచి బీసీ కాలనీగా నామకరణం చేసుకుని అక్కడే నివాసాలు ఉంటున్నారు. పంచాయతీకి ఇంటి, కుళాయి పన్నులు సైతం కడుతున్నారు. ఇటీవల బీసీ కాలనీలోని కొందరు ఇళ్ల స్థలాలకు పొజిషన్ సర్టిఫికెట్లు అందించాలని రెవెన్యూ అధికారులను సంప్రదించగా అగ్రహారం కాకమ్మ చెరువు పొరంబోకుగా రికార్డుల్లో నమోదై ఉందని, ఇవ్వడం కుదరదని నిరాకరించారు. దీంతో బీసీ కాలనీవాసులు గురువారం ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ను వింజమూరులో కలిసి తమకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం జలదంకి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

పచ్చిరొట్ట.. భూమికి రక్ష

- పచ్చిరొట్ట సాగుతో నేల సారవంతం
- పంటలకు అవసరమైన పోషకాలు లభ్యం
- సబ్సిడీ విత్తనాల కోసం రైతుసేవా కేంద్రాల్లో దరఖాస్తుల స్వీకరణ



జలదంకిలో సాగుచేసిన పచ్చిరొట్ట పైరు

జలదంకి: ఆధుక వ్యవసాయం రైతన్నకు లాభాలు తెచ్చినా పుడమి తల్లికి మాత్రం నష్టాన్ని కలిగిస్తోంది. సంప్రదాయ సాగుతో భూసారం క్రమంగా తగ్గిపోతోంది. అధిక దిగుబడులే లక్ష్యంగా రసాయన ఎరువుల వాడకం నేల స్థితిగతులనే మారుస్తోంది. నేలల్లో చౌడు శాతాన్ని పెంచడంతో పాటు సహజ లక్షణాలను దెబ్బతీస్తోంది. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించుకోకుంటే భవిష్యత్‌లో భారీ మూల్యాన్ని చెల్లించుకోక తప్పదు. ఈ విషయాన్ని గుర్తించి రైతులు పచ్చిరొట్ట సాగుకు శ్రీకారం చుట్టి భూమిని సారవంతంగా మలుచుకోవాలి. పచ్చిరొట్ట పైర్ల సాగుతో ఎరువుల పెట్టుబడులు తగ్గించుకోవడమే కాకుండా పంట దిగుబడులను పెంచుకోవచ్చని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. వరిసాగుకు ముందు పచ్చిరొట్ట పైర్ల సాగు నేలకు ఎంతో మేలు చేస్తుందని, పంట దిగుబడులు పెరుగుతాయని సూచిస్తున్నారు.

లాభాలు

వరి పొలాల్లో జీలుగ, పిల్లిపెసర, జనుము వంటి పచ్చిరొట్ట పైర్లను సాగుచేసి పూత సమయంలో కలియదున్నడం వల్ల నేల సారవంతమై భూసారం పెరుగుతుంది. భూమి బాగా గుల్ల బారుతుంది. భూమిలో సూక్ష్మ,స్థూల పోషకాల లభ్యత పెరుగుతుంది. భూమికి తేమను ఎక్కువ రోజులు నిలుపుకునే శక్తి వస్తుంది. పచ్చిరొట్ట పైర్ల వేర్లకు బుడిపెలు ఉండడం వల్ల నత్రజనిని సేకరిస్తాయి. సారవంతమైన నేలలను చౌడు భూములుగా మారకుండా చేస్తాయి. భూముల్లో లవణాల శాతం ఎక్కువగా ఉన్నప్పుడు వాటిని తగ్గించి సారవంతమైన భూమిగా మారుస్తాయి.

పచ్చిఆకు ఎరువు

పచ్చిరొట్ట పైర్లను సాగుచేసే అవకాశం లేనప్పుడు పచ్చిరొట్టను బయటి నుంచి తెచ్చి పొలంలో వేసి కలియదున్నాలి. తగినంత నీరు పెట్టి కుళ్లనివ్వాలి. జీలుగ పైరును తేలికపాటి, ఇసుక నేలల్లోనూ సాగు చేసుకోవచ్చు. చౌడు భూముల్లో అయితే చౌడులో ఉన్న లవణాలను తీసివేసి మంచి భూమిగా తయారు చేయడానికి జీలుగ పైరు ఉపయోగపడుతుంది. ఎకరా జీలుగ పైరు ద్వారా ఐదు టన్నుల పచ్చిరొట్ట ఎరువు వస్తుంది. జనుము పంట పచ్చిరొట్ట ఎరువుగాను, పశువులకు మేతగాను ఉపయోగపడుతుంది. జనుము పైరు త్వరగా పెరిగి మృదువైన ఆకులను ఇస్తుంది. ఎకరానికి 15 కిలోల విత్తనం అవసరం. పైరు పూతకు వచ్చే సమయంలో కలియదున్నాలి. ఎకరానికి 6 టన్నుల పచ్చరొట్ట ఎరువు వస్తుంది. 6 టన్నుల పచ్చిరొట్ట ఎరువులో 20 నుండి 25 కిలోల నత్రజని ఉంటుంది. అంతే కాకుండా 8 కిలోల భాస్వరం, 20 కిలోల పొటాష్ వస్తుంది.

ఎంపికలో జాగ్రత్తలు

పచ్చిరొట్ట పైర్లు త్వరత్వరగా పెరిగి ఆకులు ఎక్కువ వచ్చేలా ఉండాలి. కాండం మృదువుగా ఉండి త్వరగా కుళ్లే స్వభావం కలిగి ఉండాలి. అన్ని నేలల్లో పెరిగేలా, నీటి ఎద్దడిని తట్టుకునేలా ఉండాలి. తక్కువ సారమున్న నేలల్లో కూడా ఏపుగా పెరిగి ఎరువును ఇవ్వాలి. పైర్ల వేర్లు భూమిలోనికి లోతుగా చొచ్చుకుని పోయే గుణం కలిగి ఉండాలి. రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకుని తమ భూముల్లో పచ్చిరొట్ట పైర్లు సాగు చేసి భూసారం పెంచుకోవాలి.

50శాతం సబ్సిడీపై విత్తనాలు

జలదంకి మండలానికి 200 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు అవసరమని ప్రతిపాదనలు పంపినట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. కిలో రూ. 88 ఉండగా 50 శాతం సబ్సిడీపై అందజేస్తున్నారు. పిల్లిపెసర్లు కిలో రూ. 134 ఉండగా, 50 శాతం సబ్సిడీతో అందజేస్తున్నారు. అవసరమైన రైతులు రైతుసేవా కేంద్రాల్లోని గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి రిజిస్ట్రేషన్ చేయించుకుని రైతు వాటా నగదు చెల్లిస్తే నాణ్యమైన విత్తనాలు అందజేస్తారు.

భూమికి ఎంతో మేలు



పచ్చిరొట్ట పైర్లు భూములకు ఎంతో మేలు కలిగిస్తాయి. ఈ పైర్లు సాగు చేసి భూమిలో కలియదున్నడంతో సూక్ష్మజీవులు వృద్ధి చెందే అవకాశం ఉంది. చౌడు బారిన భూముల్లో జీలుగ పైరు వేసుకుంటే భూసారం పెరిగి పంటకు అనుకూలంగా ఉంటుంది. పైగా రసాయనిక ఎరువుల వాడకం తగ్గుతుంది. పచ్చిరొట్ట విత్తనాలను 50 శాతం సబ్సిడీతో రైతుసేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచుతున్నాం.

–బీ శైలజ, ఏఓ, జలదంకి

గంటల తరబడి విద్యుత్ కోతతో ఇక్కట్లు



అంధకారంలో ఆదూరుపల్లి బస్టాండ్ సెంటర్

చేజర్ల(ఆత్మకూరు): చేజర్ల మండలం ఆదూరుపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం గంటల తరబడి విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. 133/33 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరాను నిలిపివేస్తున్నామని విద్యుత్ అధికారులు ప్రకటించారు. అయితే రాత్రి 8 గంటల వరకు విద్యుత్ సరఫరా చేయకపోవడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. వృద్ధులు, చిన్నారులు ఉక్కపోతతో అల్లాడారు. ప్రధాన కూడలైన ఆదూరుపల్లి బస్టాండ్ సెంటర్‌లోని వ్యాపారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ అధికారులకు ఫోన్లు చేసినా స్పందనలేదని పలువురు వాపోయారు. నాణ్యమైన విద్యుత్ సరఫరాను అందిస్తామని, విద్యుత్‌చార్జీలు పెంచబోమని ఎన్నికల సమయంలో ఊదరగొట్టి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మరమ్మతుల పేరుతో గంటల తరబడి విద్యుత్ సరఫరాను నిలిపివేస్తూ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని ప్రజలు మండిపడ్డారు.

కిలో పొగాకు గరిష్ట ధర రూ.280

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో గురువారం కిలో పొగాకుకు గరిష్టంగా రూ.280 ధర లభించింది. వేలానికి 555 బేళ్లు రాగా, 410 బేళ్లను కొనుగోలు చేశారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.280, కనిష్టంగా రూ.200, సగటున రూ.247.17 ధర పలికిందని వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు.

ఆదిశేషయ్యకు సన్మానం



ఆత్మకూరు: వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, ఆత్మకూరు మాజీ జెడ్పీటీసీ సభ్యుడు డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్యను ఆయన నివాసంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, పట్టణ ప్రముఖులు గురువారం కలిశారు. జన్మదినాన్ని పురస్కరించుకుని శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ పట్టణాధ్యక్షుడు నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, నాయకులు వెంగళరెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి, పలువురు కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, జేవీవీ కార్యవర్గ సభ్యులు, తదితరులు ఉన్నారు.

తహసీల్దార్‌కు మాజీ సైనికుడి వినతి

జలదంకి: తనకు జలదంకి మండలంలో ఐదెకరాల వ్యవసాయ భూమితో పాటు ఇంటి స్థలం మంజూరు చేయాలని జలదంకికి చెందిన మాజీ సైనికుడు సొప్పర ఓంప్రకాష్ కోరారు. ఈ మేరకు తహసీల్దార్ ప్రమీలకు ఉదయగిరి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి కొట్టే వెంకటేశ్వర్లుతో కలిసి గురువారం ఆయన వినతిపత్రం అందజేశారు. దేశ సేవ చేసినందుకు జలదంకి పరిసర ప్రాంతంలో తనకు ఐదెకరాల భూమి కేటాయించాలని జలదంకి తహసీల్దార్‌కు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారని, ఈ మేరకు తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందజేసినట్లు ఓంప్రకాష్ తెలిపారు.

ఉచిత షుగర్ పరీక్షలు

ఆత్మకూరు: పట్టణంలో చేనేత కాలనీ సమీపంలోని గిరిజనకాలనీలో ఉచిత షుగర్ పరీక్షలను గురువారం నిర్వహించారు. మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ షేక్ సందానీ ఆధ్వర్యంలో అపోలో క్లినికల్ ల్యాబ్ వారు షుగర్ పరీక్షలు చేశారు. తక్కువ ధరకే షుగర్ మందులు అందజేసేలా జేవీవీ వారికి సిఫార్సు చేయనున్నట్లు సందానీ తెలిపారు.